**SRINIVASA BALABHARATI - 88**
***(Children Series)***

**Sri ChandraSekhara Bharathi**

*Kannada Script*
***L.N.Sastri***

*Telugu Translation*
***Dr. H.S.Brahmananda***

T.T.D.Religious Publications Series No.: 943

© All Rights Reserved

First Edition : 2015

Copies :

*Published by*

**Dr. D. SAMBASIVA RAO I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P. :*
Editor-in-Chief Office, TTD, Tirupati.

*Printed at:*
Tirumala Tirupati Devasthanams Press,Tirupati.

**శ్రీనివాస బాలభారతి - 88**

# శ్రీచంద్రశేఖర భారతి

కన్నడ మూలం
**యల్.ఎన్.శాస్త్రి**

ఆంధ్రానువాదం
**డా॥ హెచ్.ఎస్.బ్రహ్మానంద**

ప్రచురణ
**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
**2015**

## ఆముఖం

చిన్నపిల్లల మనసులు చల్లనైనవి, నిర్మలమైనవి. చక్కగా పెరిగిన పిల్లలు భావిభారత పౌరులై మంచి సభ్యత సంస్కారం పెంచుకొని, తమ కుటుంబానికి, దేశానికి కూడ పేరుప్రతిష్ఠలను సంపాదించి గర్వకారణమౌతారు. మన ఇతిహాసాల్లోని మహాపురుషులు, మహాపతివ్రతలు ఎలాంటివారు, వారంత గొప్పవారెలా అయినారనే విషయం, వారికథలు చెపుతూ పిల్లలకు తెలియజేయ గలిగితే, వాటి ప్రభావం లేతమనస్సులపైన చక్కని సంస్కారముద్రలను వేయగలుగుతుంది. అవి భవిష్యత్తులో వారికెంతగానో ఉపయోగపడతాయి.

ఈ ఉద్దేశ్యంతోనే "శ్రీనివాస బాలభారతి" అనే పుస్తకమాలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురిస్తోంది. ఇందులో మన భారతదేశంలో అనేక ఆదర్శాలలో ప్రసిద్ధులైన మహాత్ముల చరిత్రలు చిన్న చిన్న వాక్యాలలో చక్కని కథాకథన పద్ధతిలో చెప్పడం జరుగుతుంది. చిన్నారి బాలలు వీటిని బాగా ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నాం.



కీ.శే.డా॥ ఎస్.బి.రఘునాథాచార్యగారు రూపొందించిన ఈ ప్రణాళికను కొనసాగిస్తూ అదే శీర్షికన చాలా పుస్తకాలను ప్రచురింపజేయటంతోపాటు వాటిని హిందీ, ఆంగ్లం మున్నగు ఇతర భాషల్లోనికి అనువదింపజేస్తున్న ప్రచురణలవిభాగం ముఖ్యసంపాదకులు అభినందనీయులు. ఈ ప్రణాళికలో సహకరించిన రచయితలకు, కళాకారులకు మా ధన్యవాదాలు.

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# ఒక్క మాట

చిన్నపిల్లల్లో ధార్మిక జ్ఞానాన్ని కల్గించాలని, బాల్యంలో కల్గిన జ్ఞానం జీవితాంతం వారికి ఉపకరిస్తుందనే ఉద్దేశ్యంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఈ 'శ్రీనివాస బాలభారతి' పథకాన్ని ప్రారంభించింది. దీనికి అప్పట్లో ప్రధాన సంపాదకులుగా ఉండిన ప్రముఖ పండితులు, రచయితలు, మాజీ ఉపకులపతి డా॥యస్.బి.రఘునాథాచార్యులవారు ఈ గ్రంథాలను పరిష్కరించి తీర్చిదిద్దారు. వీరి నేతృత్వంలో కొన్ని వేల ప్రతులను చిన్న పిల్లలకు అందించడం జరిగింది.

మన ఇతిహాసాల్లోని మహాపురుషులు, మహా పతివ్రతలు, మహావీరులు భారతీయ సంస్కృతికి చక్కని పునాదులు.వారి జీవిత గాథల్ని సరళ సుందరశైలిలో, అందమైన ముద్రణతో వెలుగులోకి తేవడం జరిగింది. ప్రస్తుతం ఆ పుస్తకాలతో పాటు మరికొన్నింటిని కొత్తగా చేర్చి దేవస్థానం ముద్రించింది. భావి భారత పౌరులైన పిల్లలకు ధార్మిక సాహిత్య పరిచయం కల్గించాలనే సత్సంకల్పంతో తి.తి.దే. వీటిని అందిస్తోంది.

తల్లిదండ్రులే పిల్లలకు ప్రథమ గురువులు. కనుక వారు కూడా ఈ 'శ్రీనివాస బాలభారతి' రచనలను ఆదరించి, పఠించి వాటి ప్రాముఖ్యమును పిల్లలకు తెలియచేసి వారిచేత చదివించాలి. అప్పుడే ఆ బిడ్డలు అందరూ ఆదర్శ వంతులుగా తీర్చిదిద్దబడతారనడంలో సందేహం లేదు. నేటి మొక్కలే రేపటి వృక్షాలు కనుక ఇప్పటినుండి పిల్లలలో నైతికములైన విలువలను, ఆధ్యాత్మిక చింతనను పెద్దలు అలవాటుచేస్తే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా వెలుగొందుతూ ఆదర్శజీవితం సాగించగలరు. ఆ ఈ సంకల్పానికి ఈ బాలభారతి గ్రంథాలు చేయూతనివ్వగలవని మా విశ్వాసం.

ముఖ్య సంపాదకులు

# శ్రీ చంద్రశేఖర భారతి

"అమ్మా! నేను సన్యాసిని కావాలి. దయచేసి అంగీకరించు" – ఒక అబ్బాయి ప్రాధేయపడి అడుక్కొంటున్నాడు.

ఆ తల్లి ఇంకా మౌనంగానే ఉంది. ఆమె హృదయం దుఃఖంతో నిండిపోయింది.

"నాకు ప్రపంచంలో ఉన్న ఏ వస్తువూ వద్దు. నాకున్న ఆశ ఒకటే. దేవుడికి ప్రీతిపాత్రుడు కావడం. దానికి సన్యాసం చాలా అనుకూలం. నీవు అంగీకరించవమ్మా!" అంటూ మళ్ళీ ఆ కుర్రాడు వేడుకొంటున్నాడు.

ఆ తల్లి ఒప్పుకోలేదు. ఆమె కన్నుల్లో నీళ్ళు నిండాయి.

## తల్లి అంగీకరించింది :

"ఇప్పుడు నీవు అంగీకరించకపోతే నేను ఇలాగే కొంతకాలం ఉండొచ్చు. కాని నీవెంత బలవంతపెట్టినా నేను పెళ్ళి



మాత్రం చేసుకోను. సన్యాసం తీసుకొని ఎక్కడికైనా వేరే దేశాలకు వెళ్ళిపోతాను. అప్పుడు నీకు నా ముఖం కూడా కనిపించదు. ఇప్పుడు అంగీకరించావంటే కనీసం అప్పుడప్పుడైనా నన్ను చూడ్డానికి అవకాశం వుంటుంది. ఆలోచించవమ్మా! నా ఆశ కూడా నెరవేరేట్టుగా ఆశీర్వదించు" అని ఎంతో నెమ్మదిగా ప్రేమతో తల్లిని ప్రాధేయపడ్డాడు. ఆ అబ్బాయి నిశ్చయం ఎంతో దృఢంగా వున్నట్టుంది.

ఆ మాటల్ని వింటున్న ఆ అబ్బాయి నాన్నగారు, మరో ఆయనా – చాలా ఆశ్చర్యపడ్డారు – 'ఈ చిన్నవయస్సులో ఇంత వైరాగ్యమా!' అని. ఆ అబ్బాయి దృఢనిశ్చయం ఆ తల్లి నిర్ణయాన్ని మార్చేసింది. ఆమె ఎంతో బాధతో అంగీకరించింది.

ఆ కుర్రాడు సన్యాసి అయ్యాడు.

ఇలా శ్రీ శ్రీ చంద్రశేఖర భారతి స్వామివారు శృంగేరీ శారదా పీఠానికి జగద్గురువులయ్యారు.



## ఆదర్శ విద్యార్థి :

'శృంగేరి' పేరు మీరందరూ విని వుంటారు. ఆ వూళ్ళో 'గోపాలశాస్త్రి', ఆయన భార్య 'లక్ష్మమ్మ' కాపురం ఉండేవారు. వాళ్ళు చాలా పేదవారు. ఉన్న స్వల్పాదాయంతోనే తృప్తిగా జీవించేవారు. శాస్త్రిగారు శృంగేరీ పీఠంలో విద్వాంసులు. దైవ భక్తులూ మంచి వాళ్ళూ అయినా వీళ్ళకి పదమూడు మంది సంతానమైతే కడకు మిగిలింది ఒక అబ్బాయి మాత్రమే. ఆ అబ్బాయే నరసింహ శాస్త్రి. పిల్లల్ని కోల్పోయి చాలా బాధ పడ్డందువల్ల ఆ దంపతులకు ఈ అబ్బాయంటే ఎంతో ప్రేమా, వాత్సల్యమూ. 'వీడైనా ప్రాణం పోసుకొని బ్రదికితే శ్రీ శారదాదేవికి సమర్పిస్తా'మని వాళ్ళు అమ్మవారికి మొక్కుకొన్నారు. అది అలాగే జరిగింది.

నరసింహుడి మనస్సు చిన్నతనంనుండే దేవుడి కంకితమైంది. అప్పుడు శృంగేరీ జగద్గురువులుగా వున్న శ్రీ సచ్చిదానంద శివాభినవ నరసింహ భారతి స్వామి వారి దృష్టి

ఈ అబ్బాయిపైన పడింది. ఆయన సూచించినట్లే నరసింహుని విద్యాభ్యాసాలు జరిగాయి.

ప్రాథమిక మాధ్యమిక పాఠశాలల్లో పరీక్షల్లో నరసింహుడు బడిలో మొదటివాడుగా ఉత్తీర్ణుడయ్యేవాడు. బుద్ధిమంతుడనీ, మంచివాడనీ అందరూ నరసింహుణ్ణి మెచ్చుకొనేవారు.

మాధ్యమిక పాఠశాలా పరీక్షల తర్వాత గురువుగారి అనుజ్ఞపైన నరసింహుడు సంస్కృత పాఠశాల్లో చేరాడు. కావ్యాలు, నాటకాలు, అలంకారం, వ్యాకరణం మొదలైన శాస్త్రాలన్నీ చాలా తొందరగా పూర్తి చేశాడు. ఒకసారి చెబితే చాలు. ఎలాంటి కష్టమైన పాఠమైనా ఇట్టే గ్రహించేవాడు నరసింహుడు.

నరసింహుడికి చాలా సిగ్గు. ఎక్కువగా మాట్లాడే వాడు కాడు. దారిలో వెళ్ళేటప్పుడు కూడా ఒకవైపు ఒదిగి తలవంచుకొని వెళ్ళేవాడు. అప్పుడు కూడా ఏదో ఒక పాఠ్యాంశాన్ని ఆలోచిస్తూనో, లేక ఏ దేవతాస్తోత్రాన్నో జపిస్తూనో ఉండేవాడు. కాని అప్పటికే



నరసింహుడిలో పరోపకారబుద్ధీ, ఇంకొకరి కష్టంలో భాగం పంచుకొనే మృదుస్వభావం వుండేవి. కష్టమంటే ఎవరికైనా సహాయం చేసేవాడు.

చుట్టుప్రక్కల ఇళ్ళ వాళ్ళకు నరసింహుడు ఎంతో ఉపకారం చేసేవాడు. అందులోనూ విద్యను నేర్పే గురువుల సేవ అంటే మరింత శ్రద్ధ. తల్లిదండ్రుల్ని ఎంత భక్తితో చూసేవాడో, అంతే గౌరవ భక్తులు గురువులపైనా ఉండేది.

తన తోటి విద్యార్థులంటే నరసింహుడికి ఎంతో ప్రేమ. వాళ్ళు చదువుకోవడానికి ఇబ్బంది పడుతుంటే పాఠం నేర్పేవాడు.

**శిష్యుడి ప్రమాణ బుద్ధి :**

శృంగేరిలో ఒక విద్యార్థి వసతిగృహం వుండేది. అందులో వున్న కొందరు 'సీనియర్' విద్యార్థులు 'చీట్లపేక' అప్పుడప్పుడూ ఆడుతుండేవారు. నరసింహుడూ అక్కడికి చదువుకోడానికి వెళ్ళేవాడు. ఆ 'పేకాట' ఆడేవాళ్ళు తనకంటె పెద్దవాళ్ళు. అయినా



మందలిస్తూఉండేవాడు నరసింహుడు: 'తెలిసి తెలిసి ఇబ్బందుల్లో తగులుకోవడం మంచిదికా'దని వాళ్ళకు నీతి చెప్పేవాడు. కాని మెత్తటివాడు – ఈ అబ్బాయి మాటల్ని వాళ్ళు చెవినపెట్టేవాళ్ళు కారు.

ఒక రోజు మధ్యాహ్న సమయం. నరసింహుడు విద్యార్థి మందిరంలో ఉన్న దేవాలయం ముంగిట వున్న అరుగుపై కూర్చుని చదువుకొంటున్నాడు. వాళ్ళు పేకాడుతున్నారు. ఉన్నట్టుండి ఒక 'మాష్టారు' లోపలికి వచ్చేశారు. నరసింహుడు లేచి నిలబడి వారికి నమస్కారం చేశాడు. తక్కిన అబ్బాయిలు ఇది చూసి జాగ్రత్తపడి పేక ముక్కల్ని దాచేశారు. పుస్తకాలు పట్టుకొని చదువుతున్న వాళ్ళలాగా నటించారు. కాని వాళ్ళ గుండెలు భయంతో తల్లడిల్లసాగాయి.

నరసింహుడి దగ్గరికి మాష్టారు వచ్చారు.

'అబ్బాయ్! ఇక్కడెవరో 'పేకాట' ఆడుతున్నారని ఫిర్యాదు వచ్చింది. నిజమేనా?' అని అడిగారు.



నిజంగా ఆడుతున్న విద్యార్థుల గుండెలు దడదడలాడటం మొదలు పెట్టాయి. 'నరసింహుడు అబద్ధం చెప్పేవాడు కాదు. ఉన్నదాన్ని ఉన్నట్టు చెబుతాడు. మాష్టారు తమందర్నీ పాఠశాల నుంచి బయటికి పంపించేస్తారు. వసతిగృహం నుంచి కూడా ఉండనివ్వరు. చదువూ పోతుంది. గౌరవమూ పోతుంది' – అంటూ భయపడుతూ ఆ అబ్బాయిలు బిక్కు బిక్కు మంటూ నరసింహుడివైపే చూడ్డం మొదలుపెట్టారు.

అప్పుడు గురువుగారిని చూసి నరసింహుడిలా అన్నాడు– 'లేదు మాష్టారూ! ఇక్కడెవ్వరూ పేకాటాడ్డం లేదు'

'అలా అయితే సరే!' అంటూ గురువుగారు బయటికి వెళ్ళిపోయారు. ఆ తర్వాత తోటి పిల్లలందరూ నరసింహుడి చుట్టూ చేరి, తమ ప్రవర్తనను తామే నిందించుకొన్నారు. ఇక మీదట పేకాట ఆడమని ఒట్టు కూడా పెట్టుకొన్నారు.

తన స్నేహితుల్ని రక్షించడానికి నరసింహుడు అబద్ధం చెప్పాడు. కాని సత్యదృష్టి వున్న ఆ అబ్బాయి మనస్సు

విలవిలలాడిపోయింది – మాష్టారుతో అబద్ధం చెప్పాను కదా! అని తటపటాయించాడు. మరుసటి రోజు ఉదయమే వెళ్ళి గురువుగారి దగ్గర తప్పుచేసిన వాడిలాగా నుంచున్నాడు.

'ఏం బాబూ! ఇంత ఉదయాన్నే వచ్చావే!' అని మాష్టారు అడిగారు.

దుఃఖంతో నరసింహుడు తలవంచుకొని తాను అబద్ధం చెప్పడాన్ని, దానికి కారణాన్ని వివరించాడు. తనని క్షమించమని కోరాడు. నరసింహుడి సమయస్ఫూర్తిని ప్రమాణ (ధర్మ) బుద్ధిని చూసి గురువుగారు మెచ్చుకొన్నారు.

## గురువుగారి పిలుపు :

శ్రీ శంకరాచార్యుల వారి పేరు ప్రపంచమంతటా చాలా ప్రసిద్ధమైంది. హిమాలయాలనుంచి కన్యాకుమారి దాకా మన భారతదేశం అఖండమన్న విషయాన్ని – అంటే ఒకటేనన్న విషయాన్ని – శ్రీ శంకరులు కొన్ని వందల సంవత్సరాల క్రితమే



నిరూపించారు. హిందూ ధర్మంలోని ఐక్యతను కాపాడటానికి ఆయన భారతదేశంలోని నాలుగు దిక్కుల్లోనూ నాలుగు ధర్మపీఠాల్ని స్థాపించారు. వాటిలో శ్రీ శృంగేరి పీఠం మొదటిది. శంకరులు మొదలు చాలా మంది మహాత్ములు శ్రీ శారదా పీఠం ద్వారా ధర్మప్రచారం చేశారు.

ఇప్పటికి దాదాపు 80 సంవత్సరాల క్రితం అక్కడున్న జగద్గురువులు శ్రీ సచ్చిదానంద శివాభినవ నరసింహ భారతీస్వామి. మహాతపస్వి, రాజయోగి అయిన ఆ మహాత్ముడు నరసింహుణ్ణి తమ శిష్యునిగా స్వీకరించాలని నిర్ణయించుకొన్నారు. అందుకే వారు నరసింహుడి 'పెంపుదల'లో చాలా శ్రద్ధ వహించారు. బెంగళూరులోని మహాపాఠశాలలో మీమాంస, వేదాంత శాస్త్రాల్ని చదవడానికి నరసింహుడిని పంపారు.

అప్పటికే పెద్దస్వామివారు అప్పుడప్పుడూ అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవారు. శృంగేరిలోనే ఉండేవారు. తానింక ఎక్కువ కాలం జీవించనని వారికి తెలిసింది. నరసింహుడిని



పిలిపించి తొందరగా సన్యాస దీక్ష ఇప్పించాలని గురువుగారు నిర్ధారించారు. అప్పుడు వెంటనే బెంగళూరులో చదువుతూఉన్న నరసింహుడిని పిలుచుకు రావడానికి కొందర్ని పంపారు.

సన్యాసి కావాలని నరసింహుడికి చిన్నప్పటి నుంచీ కోరిక వుంది. గురువుగారి ఆజ్ఞను విన్నపుడు నిజంగా ఆశ్చర్యపడ్డాడు. అలాంటి మహానుభావుడికి శిష్యుడయ్యే యోగం తనకు కల్గింది గదా అని సంతోషించాడు. సన్యాసానికి తన అంగీకారాన్ని సూచించాడు. కాని తల్లిదండ్రుల్ని ఒప్పించడం చాలా కష్టమైంది. అందులోనూ తల్లిని మరింత ప్రయాసపడి ఒప్పించాల్సి వచ్చింది. ఏమయితేనేం! కడకు ఆమె అనుమతీ దొరికింది.

## శ్రీ చంద్రశేఖర భారతి :

అప్పటి మైసూరు మహారాజు నాల్మడి కృష్ణరాయలు ఆ సమయంలో బెంగళూరులోనే వున్నారు. వారిని చూడటానికి మఠాధిపతి – కొత్త స్వామి – అయిన నరసింహశాస్త్రి వెళ్ళారు. మహారాజుగారు శాస్త్రిగారితో: "మిమ్మల్ని ఉత్తరాధికారిగా



నియమించే విషయం ముందుగానే జగద్గురువులు నాతో చెప్పారు. చాలా సంతోషం. నేను చేయాల్సిన సేవ ఏదైనా సరే, చెయ్యడానికి సిద్ధంగా వున్నా'' నని అన్నారు. అప్పుడు శాస్త్రిగారు "శ్రీ జగద్గురువుల అనుజ్ఞ ననుసరించి సన్యాసం స్వీకరించడానికి నేను సిద్ధంగా వున్నాను. కాని మఠానికి సంబంధించిన పరిపాలనా వ్యవహారాలు నా సన్యాస జీవితానికి అడ్డురాకుండా మీరు నియమిస్తే చాలు'' అని తెలియజేశారు. మహారాజుగారూ తమ సమ్మతిని తెలియజేశారు.

తర్వాత శాస్త్రిగారు శృంగేరికి వచ్చారు. ఆ సమయానికే శ్రీ సచ్చిదానంద శివాభినవ నరసింహ భారతీ స్వామివారు మహాసమాధిని పొందివున్నారు. తమ గురువుగారి నిర్యాణానికి శాస్త్రిగారు చాలా బాధపడ్డారు. గురువుగారి ఆరాధనా కార్యక్రమాల్లో ఎంతో భక్తితో పాల్గొన్నారు. తర్వాత సన్యాసం స్వీకరించి శ్రీ శ్రీ చంద్రశేఖర భారతి – అన్న పేరును పొందారు.



**యోగి :**

శ్రీ చంద్రశేఖర భారతీస్వామి సన్యాసం స్వీకరించిన కొన్ని రోజుల్లోనే ఆ పదవికి అర్హులనిపించుకొన్నారు. మూడు వేళలా స్నానం, ఆహ్నీకం, జపం, పూజ, తపస్సు, వేదాంత శాస్త్రాధ్యయనం – వీటిలో మగ్నమయ్యారు. బెంగళూరులో నిలిచిపోయిన వేదాంత విద్యాభ్యాసాన్ని రెండేళ్ళలో పూర్తి చేశారు. ఇక మిగిలింది – చదివిన శాస్త్రాల్ని అనుభవంలోకి తీసుకు వచ్చే ప్రయత్నం చెయ్యటమే.

పూర్వ గురువులు శ్రీ నరసింహభారతి యోగాభ్యాసంలో కూడా చాలా సాధన ఉన్నవారు. ఈ విషయం గ్రహించి శ్రీ చంద్రశేఖర భారతి కూడా యోగాభ్యాసం మొదలుపెట్టారు.

ఏదో ఒక శబ్దం వింటే మనం ఆ వైపు తిరుగుతాం. ఆ శబ్దం వినడానికి బాగుంటే మరి కొంచెం సేపు విందాం – అనిపిస్తుంది. కదూ! అలాగే ఏదైనా అందమైన వస్తువుని చూస్తే కళ్ళప్పగించి చూస్తాం. మంచి వాసన వస్తే ముక్కు లెగరేస్తాం.



ఇలాగే కన్ను, చెవి, ముక్కు, నాలుక, చర్మం ఇవి మనకూ, బయటి వస్తువులకూ సంబంధాన్ని కల్గిస్తాయి. వీటినే 'జ్ఞానేంద్రియాలు' అని అంటారు. చెవితో వినటం, కన్నులతో చూడటం, ముక్కుతో వాసన పట్టటం, నాలుకతో రుచిని తెలుసుకోవటం, చర్మంతో వేడి, చలి – అన్న అనుభవాల్ని పొందటం – ఇవి ఎప్పుడూ జరిగే పనులు. మన మనస్సు ఈ ఇంద్రియాలకు అధిపతి – అంటే యజమాని. ఈ ఇంద్రియాలద్వారా మనస్సు ఎప్పుడూ బయటవైపే తిరుగుతూ వుంటుంది. ఈ జ్ఞానేంద్రియాల జతకు కాలు, చేయి, నోరు మొదలైన కర్మేంద్రియాలు కూడా చేరడంతో మనస్సెప్పుడూ అది కావాలి! ఇది కావాలి! అన్న కోరికలు రేకెత్తిస్తూ, చంచల స్వభావాన్ని కల్గిస్తుంది. ఆ మనస్సును బయటి వస్తువులవైపు పోనీకుండా అడ్డగించి, అంతర్ముఖంగా – అంటే లోపలి వైపునకు తిప్పడానికి చేసే ప్రయత్నమే అన్నమాట 'యోగాభ్యాసం' అంటే. ఇలా లోపలికి తిప్పిన మనస్సును దేవుడి వైపు కేంద్రీకరించడమే యోగాభ్యాసానికి ధ్యేయం – అంటే గురి. ముందు చెప్పినట్టు – మనస్సు 'గాలిలో పెట్టిన ప్రమిద'లాగా చంచల స్వభావం కల్గింది.



గాలిలో దీపం అటూ ఇటూ ఊగుతూ తటపటాయిస్తుంటే రాసుకోవడం, చదువుకోవడం వీలవుతుందా! కాదు. గాలి తాకిడి నుంచి దీపాన్ని దూరంగా వుంచితే దీపం నెమ్మదిగా ప్రకాశవంతంగా వెలుగుతుంది. వెలుగు కూడా నిశ్చలంగా వుంటుంది. అలాగే మనస్సు కూడా నిశ్చలం కావాలి.

ఇది చాలా కష్టమైన విషయం. ఎంతో కాలం వదలకుండా అభ్యాసం చేస్తే కాని సాధించలేని విషయం. ఒకసారి భగవంతుడిలో మనస్సు లీనమైందంటే బయటి వస్తువు ఎంతటి గొప్పదైనా మనస్సు కోరదు. అలాంటి యోగికి ఎక్కడ చూసినా దేవుడే కనిపిస్తాడు. ఇలావుండే వాణ్ణి చూస్తే దుర్మార్గులూ మంచి వాళ్ళయిపోతారు. పాము, పులి మొదలైన క్రూర జంతువులు కూడా సాధు ప్రాణులైపోతాయి. ఇలాంటి యోగికి ఆకలి లేదు. దప్పి లేదు. నిద్ర లేదు. వేడి, వాన, చలి, గాలి ఇవి ఏవీ ఆ యోగిని బాధించవు. యోగులు పొందే ఈ స్థితినే 'సమాధి' అంటారు. శ్రీ చంద్రశేఖర భారతి ఇలాంటి దివ్యస్థితిని పొందిన మహాత్ముడు.

## పిచ్చివాడా ?

గురువుగారు ఇలా సమాధిలో నెలలకొద్దీ ఉండిపోయే వారు. అపుడు తిండి లేదు – నిద్ర లేదు. ఒంటరిగా అలాగే ఉండిపోయేవారు. కొందరికి ఇది 'పిచ్చిదనం' అనిపించింది. వైద్యులు కూడా వచ్చి అన్నిరకాల పరీక్షలు జరిపారు. ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. యోగశాస్త్రం తెలిసిన వాళ్ళకు మాత్రం ఇది 'సమాధి స్థితి' అని తెలిసింది. ఇలాంటి స్థితిలో ఉన్న మహాత్ములు ఒక్కోసారి ఏమీ తెలియని మూఢుల్లాగా, పిచ్చివాళ్ళలాగా, పిల్లల్లాగా, ఒక్కోసారి మహారాజుల్లాగా, చక్రవర్తుల్లాగా ప్రవర్తించడం వుంటుంది.

చంద్రశేఖర భారతీ స్వామివారి అసాధారణ శక్తుల్ని గురించి భక్తులు అనేక సంఘటనలు చెబుతూ వుంటారు.

ఒకసారి ఇలాగే గురువుగారు 'సమాధి'లో వున్నారు. అది రాత్రి సమయం. పెద్ద వర్షం కురుస్తోంది. హోరుగాలి, చలిగా వుంది. గురువుగారు కిటికీ దగ్గరికి వచ్చి అక్కడున్న ఒక



సేవకుణ్ణి పిలిచారు. నిద్రపోతున్న ఆ సేవకుడు తటాలున లేచి నిలబడ్డాడు. అప్పుడు స్వామి "చూడు! మఠానికి ఆ వైపున కొసలో వుండే గదిలో ఒక గోడ కూలిపోయింది. ఒక సన్యాసి పాపం దాని క్రింద ఉండిపోయారు. పోయి ఆయన్ని రక్షించు" అన్నారు. గురువుగారన్నది తుంగానదికి దక్షిణ తీరంలో. మఠమూ గదులూ ఉన్నవి తుంగానదికి ఉత్తరం వైపు. ఆ సన్యాసి ఎక్కడో ఆ ఉత్తరం వైపు గదుల్లో కడపట వున్నాడు. ఆ సేవకుడు లాఠీకర్ర చేత బట్టుకొని ఆ చీకట్లోనే నదిని దాటిపోయి చూశాడు. నిజమే! గురువుగారు చెప్పినట్లే ఒక సన్యాసి కూలిపోయిన గోడ అడుగున పడిపోయి చావు బదుకుల్లో ఉన్నాడు. ఆ సేవకుడు వెంటనే ఒకరిద్దర్ని తనకు తోడుగా తీసుకొని ఆ స్వామిని బయటికి లాగి రక్షించారు.

మరోసారి గురువుగారు మఠం పరిపాలనాధికారిని పిలిపించి నేపాల్ రాజు "త్రిభువన్" వారికి ఆశీర్వాద లేఖ వ్రాయించారు. ఆ సమయంలో త్రిభువన్ రాజ్యాన్ని పోగొట్టుకొని



చాలా కష్టాలుపడి భారతదేశంలో తలదాచుకోవడానికి వచ్చి ఉన్నాడు. ఆ విషయం పత్రికల్లో రాకముందే గురువుగారికి తెలుసన్నమాట. శ్రీ పశుపతి నాథ, శ్రీ శారదాంబల పరమాను గ్రహంతో మీ కష్టాలన్నీ మూడు వారాలలో సూర్యోదయానికి ముందుగానే తీరిపోతాయని గురువుగారు లేఖలో వ్రాయించారు. గురువుగారి మాట ప్రకారమే త్రిభువన్ రాజు తన రాజ్యాన్ని మళ్ళీ పొందగలిగాడు.

## అర్హత ఉండాలి !

శ్రీ గురుపాదులు సమాధి నుంచి బయటికి వచ్చినపుడు ఆయన దర్శనం కోసం వేలకొద్దీ భక్తులు వచ్చేవారు. ఆ సమయంలో గురువుగారు మూడుపూటలా స్నాన, జప, అనుష్ఠానాల్ని నిర్వహించేవారు. వచ్చిన వారి కష్టనష్టాల్ని విచారించే వారు. తీర్థ ప్రసాదాలిచ్చే వారు. రాత్రివేళ తామే స్వయంగా శ్రీచంద్రమౌళీశ్వర స్వామి పూజ చేసేవారు.



తమ కష్టాలు, రోగాలు, బాధలూ, భయభ్రాంతులూ స్వామికి చెప్పుకోవడానికి చాలామంది ఆయన దర్శనం చేసుకొనేవారు. గురువుగారు అందరికీ సమాధానాలిచ్చేవారు. శాంతిని కలగజేసేవారు. శాస్త్ర సందేహాలు ఉన్నవాళ్ళకు సందేహాల్ని నివారించేవారు. ఆధ్యాత్మిక సాధనలో ఇబ్బందులకు గురిఅవుతున్న వాళ్ళకు ఆ ఇబ్బందుల్ని తొలగించడంలో సాయపడేవారు. చాలామంది గురువుగారిని వైద్యుడుగా భావించి మేలుపొందే వారు. ప్రజల కష్టాల్ని, దుఃఖాల్ని పరిహరించడంలో గురువుగారు ఎప్పుడూ సహానుభూతి పొందేవారు. అంటే ఆ కష్టాలు తమవిగా భావించి తీర్చేవారన్నమాట.

ఆధ్యాత్మిక సాధన చెయ్యడానికి మంత్రోపదేశం కావాలని ఎవరైనా వస్తే వారి యోగ్యతల్ని, అర్హతల్ని గురువుగారు పరీక్షించేవారు. వారి నడత, స్వభావం – వీటిని గురించి తెలుసుకొనేవారు. తర్వాతే వారికి యోగ్యమైన మార్గాన్ని సూచించేవారు.

అర్హత అంటే ఏమిటి? యోగ్యత అంటే ఏమిటి? అన్న విషయాలు తెలుసుకోవాలి. ఒక తరగతిలో చేరాలంటే 'ఫలానా' పరీక్షలో 'పాసు' కావాలన్న నియమం ఎలా ఉందో! అలాగే ఆ పరీక్షలో నెగ్గివుంటే గురువుగారు తర్వాత చెప్పబోయే విషయాల్ని సులభంగా అర్థం చేసుకోవచ్చు.

## 'ఈ పీఠానికి చెందాల్సిన గౌరవమర్యాదలు వీరికే చెల్లాలి' :

లేకపోతే తరగతి చేరినా ప్రయోజనం లేదు. అలాగే ఆధ్యాత్మిక సాధనకూ ప్రతి ఒకడి అర్హత, యోగ్యతల్ని బట్టి గురువుగారు మార్గాల్ని చూపించేవారు. శిష్యుడి మనస్సు ఎంత పరిపక్వమో – అంటే ఎంత పండిందో! గ్రహించడానికి యోగ్యమో! – దాన్ని బట్టి ఉపదేశం చేసేవారు గురువుగారు.

శిష్యులదగ్గరనుంచి గురువుగారు ఏం కోరేవారు? సత్యమూ, ప్రమాణబుద్ధీ, మోసం లేకుండా ప్రవర్తించడం, న్యాయసమ్మతంగా జీవించడం, డొంక తిరుగుడు కాకుండా



ఋజుమార్గంలో నడవడం – ఇవి మాత్రమే. ఈ ధర్మంలో నమ్మకం ఉన్న వాళ్ళను గురువుగారు ఎంతో మెచ్చుకొనేవారు.

## ధర్మగురువుల కర్తవ్యం :

ఒక పెద్ద అధికారి ఉండేవాడు. ఆయన గురువుగారి దర్శనం కోరుతూ మఠానికి ఉత్తరం రాశాడు. ప్రభుత్వంలో ఒక ఉన్నతాధికారంలో ఉన్నవాడాయన. రాజకీయంగా కూడా చాలా పేరు ప్రసిద్ధులున్నవాడు. విద్యావంతుడనీ, చాలా బుద్ధిమంతుడనీ కూడా ఆయన్ని గౌరవించేవారు.

కాని ఆ అధికారి ఉత్తరం చేరినప్పటికీ మఠాధికారులు ఆయనకు సమాధానం వ్రాయడానికి ఆలస్యం చేశారు. తన ఉత్తరం మఠానికి అందిందో లేదో అని ఆయనకు అనుమానం వచ్చింది. మరో ఉత్తరం రాశాడు. అప్పుడు మఠాధికారులు ఈ విషయం గురువుగారికి విన్నవించారు. గురువుగారన్నారు: "మొదటి ఉత్తరానికే మీరు బదులు రాయాల్సింది. ఇప్పుడైనా వెంటనే ఆయన్ని రమ్మంటూ ఉత్తరం రాయండి".



అప్పుడు మఠాధికారి "ఆయన ప్రవర్తన, గుణం, మంచివి కావు. మత్తుపానీయాలు తాగుతాడు. మాంసం కూడా తింటాడు. చాలా పొగరుబోతు"అని ఆ అధికారిని గురించి అన్నాడు.

"ఉండనీ! రానివ్వండి. అలాంటి వాళ్ళని సరిదిద్దడానికే మనం వున్నది. మంచివాళ్ళకూ, సద్గుణవంతులకూ మనలాంటి వాళ్ళనుంచీ ఎలాంటి సహాయమూ అక్కరలేదు. ఎవరు చెడ్డమార్గంలో ఉంటారో, ఎవరు చెడిపోయారో, ఎవరి గుణ ప్రవర్తనలు అధమస్థితిలో ఉంటాయో, అలాంటి వాళ్ళను సరిదిద్దడమే ధర్మగురువులు చేయాల్సిన పని. అందువల్ల ఆయన్ని రమ్మంటూ ఉత్తరం రాయండి"– అంటూ గురువుగారు అనుజ్ఞ ఇచ్చారు.

ఆ అధికారి శృంగేరికి వచ్చాడు. గురువుగారి దర్శనం చేసుకొన్నాడు. చాలాసేపు స్వామితో ప్రసంగించాడు. గురువుగారి ఉపదేశంతో అతని మనసు మారిపోయింది. తన దుర్మార్గ మార్గాన్ని వదలిపెట్టి ఎంతో సాత్త్విక స్వభావాన్ని పొంది మంచివాడయ్యాడు. గురువుగారికి ఆప్తభక్తుడూ అయ్యాడు.



ఒకసారి ఓ అబ్బాయి స్వామి దర్శనం కోసం వచ్చాడు. పాపం! ఆ అబ్బాయికి నాన్నలేడు. అనాథ. చాలామంది గురువుగారి దర్శనం చేసుకొని సంతోషంతో తిరిగిపోతున్నారు. చాలామంది మంత్రోపదేశం పొందడాన్ని చూసిన ఆ అబ్బాయి తానూ ఏదైనా మంత్రాన్ని స్వామి దగ్గర నేర్చుకోవాలని ఉబలాటపడ్డాడు. కాని ఆ అబ్బాయి గోడు వినేవాళ్ళు ఎవరున్నారు? లోనికి వెళ్ళడానికే ఆ అబ్బాయికి వీలులేకపోయింది.

ఒక రోజు మఠం బయట స్తంభానికి ఆనుకొని ఆ అబ్బాయి కూర్చున్నాడు. లోపల ఉన్న గురువుగారు ఒక సేవకుణ్ణి పిలిచి, "బయట ఒక అబ్బాయి కాచుకొని ఉన్నాడు. చాలా రోజుల్నించి వస్తున్నాడు. స్తంభానికి ఒదిగి కూర్చున్నాడు. లోనికి పిలుచుకురా!" అని పంపారు. ఆ సేవకుడు ఆ కుర్రాణ్ణి లోనికి తీసుకు వెళ్ళాడు. ఆ అబ్బాయికి ఎంతో ఆశ్చర్యం వేసింది – సంతోషంతో కన్నుల్లో నీళ్ళు నిండాయి. సాష్టాంగ నమస్కారం చేసి చేతులు జోడించుకొని నిలబడ్డాడు.

"నీకేం కావాలి బాబూ!" అని గురువుగారు ప్రశ్నించారు.

"నేను చాలా మొద్దునని అందరూ ఎగతాళి చేస్తుంటారు. చదువు నేర్చుకోవడం చాలా కష్టంగా వుంటుంది నాకు. నాకేదైనా మంత్రం నేర్పించండి" అన్నాడు ఆ అబ్బాయి. గురువుగారికి చాలా ఆశ్చర్యమైంది.

"అలాగే! రేపు రా!" అన్నారు.

ఆ కుర్రాడు అలాగే మరుసటి రోజున వచ్చాడు. సేవకులు అడ్డు చెప్పకుండా లోపలికి పంపారు. గురువుగారు ఆ అబ్బాయిని చూసి

''చూడు నాన్నా! మంత్రోపదేశం పొందడానికి పరిశుభ్రంగా ఉండాలి. నీవు అప్పుడే భోంచేసేశావే" అని అన్నారు.

ఆ అబ్బాయికి నిజంగా ఆశ్చర్యమనిపించింది – తాను ఇంట్లో 'చద్ది' అన్నం తిని రావడం గురువు గారికి ఎలా తెలిసిందా! – అని.



వినయంతో తలవంచుకొని, 'గురువుగారూ! పొరపాటయిపోయింది. నాకు తెలియదు. రేపు నదిలో స్నానం చేసి సంధ్యావందనం కూడా ముగించి మీ దర్శనానికి వస్తాను' అని విన్నవించుకొన్నాడు. అలాగేనని గురువుగారు ఆ మరుసటి రోజున ఆ అబ్బాయికి మంత్రోపదేశం చేశారు. ఆ కుర్రాడికి ఉన్న 'మంకు' తనం, 'మూర్ఖత్వం' పోయి – బుద్ధిమంతుడయ్యాడు.

## దేవుడి స్తోత్రం చెప్పడానికి . . . . .

శ్రీ గురుపాదులు తమ ఉదయ పూజల్ని ముగించిన తర్వాత తమ గురువు శ్రీ నరసింహ భారతీ స్వామి సమాధి దగ్గరికి వెళ్ళి గురుదర్శనం చేసి వచ్చేవారు. ఒక రోజున గురువుగారు సమాధి మందిరం నుంచి బయటికి వస్తున్న సమయంలో ఆ దగ్గరే ఒక చెట్టు క్రింద ఓ అబ్బాయి ఏడుస్తూ నిలబడి ఉండటం స్వామి చూశారు. వాణ్ణి తన దగ్గరికి పిలవకుండా, తానే ఆ అబ్బాయి దగ్గరికి వెళ్ళారు. తన సమీపానికి వచ్చిన గురువుగారిని చూసి ఆ అబ్బాయి స్వామి కాళ్ళమీదపడి నమస్కరించాడు. నిలబడి



చేతులు జోడించాడు. వాడి కళ్ళల్లో నీరు ఇంకా అలాగే నిలిచి ఉన్నాయి.

"బాబూ! ఎందుకు ఏడుస్తున్నావు!" అని గురువుగారు అడిగారు. ఆ అబ్బాయి ఇంకా ఎక్కువగా ఏడవటం మొదలు పెట్టాడు.

గురువుగారు మళ్ళీ అడిగారు: "నీ పేరేమిటి బాబూ!" అని.

"నరసింహుడు" అంటూ ఆ అబ్బాయి చెప్పాడు.

"ఎక్కడినుంచి ఇక్కడికి వచ్చావు?"

"రామనాథ పురం నుంచి"

"ఎవరబ్బాయివి?"

ఆ అబ్బాయి తన తండ్రి పేరు చెప్పాడు.

"మరి నీవు ఎందుకేడుస్తున్నావ్!"

"నేను లలితాసహస్రనామ స్తోత్రం చదువుతూ వుండేవాణ్ణి.... మరేమో! మా శాస్త్రిగారు "మడీలేదు – మైలాలేదు –



ఎప్పుడుపడితే అప్పుడు సహస్రనామ స్తోత్రం చెబుతావా! చాలు! ఆపెయ్!" అని గదమాయించారు. అలా చదివితే చాలా ఇబ్బందులు వస్తాయని కూడా చెప్పారు.... అందుకే.... ఏడుస్తున్నా..... " అన్నాడా అబ్బాయి.

"పాపం! మీ శాస్త్రిగారికి 'అజ్ఞానం' ఎక్కువగా వుంది. కాకపోతే – దేవుణ్ణి ప్రార్థించడానికి మడి, మైల – వీటి ఆటంకాలు ఉన్నాయా! లేవు! ఇది సమయమని కాని, ఇది సమయం కాదని కాని లేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు దైవస్తుతులు చెప్పు కోవచ్చు. ముఖ్యంగా మనస్సు పరిశుభ్రంగా వుండాలి. భక్తి కావాలి. అంతే! నీవు లలితా సహస్రనామం పూర్తిగా నేర్చు కొన్నావా!"

"మా తాతగారే చెప్పించారు. నాకు కంఠాపాఠంగా వచ్చు"

"అలా అయితే ఎవరి భయమూ అక్కరలేదు. ధైర్యంగా 'తల్లి'ని స్తుతించు," అని గురువుగారు ఆ కుర్రాడికి ప్రసాదమిచ్చి ఆశీర్వదించారు.



## మీ మతాన్ని సరిగ్గా అర్థం చేసుకోండి !

శ్రీ గురుపాదుల దగ్గర మార్గోపదేశం పొందడానికి అన్ని మతాలవాళ్ళు, జాతులవాళ్ళూ వచ్చేవారు. ప్రతి ఒక్కడూ తన మతధర్మాన్ని శ్రద్ధతో ఆచరిస్తే, ఇతర మతాలపైన ద్వేషాన్ని వదిలిపెడితే 'లోక కల్యాణం' తప్పక జరుగుతుందని గురువుగారు బోధించేవారు.

ఒకసారి ఓ పాశ్చాత్యుడు – గురువుగారి దర్శనం కోసం వచ్చాడు. అతడికి తన మతమైన క్రైస్తవ మతంలోనే నమ్మకం వుండేది కాదు. హిందూధర్మానికి సంబంధించిన అనేక గ్రంథాల్ని చదివాక అతడికి హిందూమతంలో చేరాలన్న కోరిక కల్గింది. గురువుగారికి తన కోరికను విన్నవించాడు.

"మీరు హిందువులుగా మారాల్సిన అవసరమే లేదు. హిందువులుకాని వాళ్ళుకూడా హిందూధర్మ నియమాలను పాటించవచ్చు" అన్నారు గురువుగారు.

"గురువుగారూ! అది ఎలా సాధ్యం" అని అతడి ప్రశ్న.



"చూడండి! హిందూమతం అని పిలవడమే తప్పు. ఇది హిందూమతం కాదు. ఇది హిందూధర్మం. ఎందుకంటే ఇది ఎవరో ఒక మతప్రవక్త స్థాపించిందని చెప్పడానికి వీల్లేదు. 'ఫలానా' కాలంలో పుట్టింది; దానికి ముందు ఈ మతం లేదు – అని చెప్పడానికీ వీలులేని ధర్మమిది. అన్ని మతాలూ చెప్పే మూల సూత్రాలు, ఉపదేశాలూ హిందూధర్మంలోనే వున్నాయి".

"అలా అయితే నేను ప్రత్యేకంగా హిందూమతంలో చేరాల్సిన అవసరం లేదన్నారు. అయితే నేను ఇప్పుడు ఏం చెయ్యాలో కూడా చెప్పండి"

"మీరు మీ మతబోధనల్లోనే నమ్మకం ఉంచి నడవాలి"

"స్వామీ! మా మతంలో మార్గదర్శనం చేయించే గురువులే నాకు కనిపించడంలేదు".

"దాన్ని నేను అంగీకరించను. మీరు నిజమైన శ్రద్ధతో వెదికితే నిజమైన మార్గాన్ని చూపే వాళ్ళు తప్పక దొరుకుతారు. మొదట మీ మతాన్ని సరిగ్గా అర్థం చేసుకోండి. మీరు ఈనాటి నుంచే మీ మతతత్వాల్ని అనుసరించండి".



గురువుగారి ఈ ఉపదేశంతో ఆ విదేశీయుడు ఆశ్చర్యం పొందాడు. "స్వామీ! మీరు నా మతంపైన నాకేర్పడిన అజ్ఞానాన్ని తొలగించారు. నేను ఉత్తమ క్రైస్తవుడిగా మారడానికి ప్రేరేపించారు. నేను మీకు ఎంత కృతజ్ఞుడైనా చాలదు"

అని చెప్పి నమస్కరించాడు.

## గురువుగారి సమీపానికి రావడానికి ముందుగా .....

తల్లిదండ్రులపైనా, గురువులపైనా, పెద్దలపైనా భక్తిశ్రద్ధలు ఉండాలని గురుపాదులు తమను సమీపించిన వారికి చెప్పేవారు.

ఒకసారి ఒకాయన గురువుగారి దర్శనం కోసం వచ్చాడు. ఆయన చాలా బుద్ధిమంతుడైన 'న్యాయవాది'గా పేరున్నవాడు. భార్యతో కూడా వచ్చి ఆయన గురువుగారికి నమస్కరించి కూర్చున్నాడు. గురువుగారు వారి యోగక్షేమాల్ని విచారించారు. న్యాయవాది ఇలా అన్నాడు :

"గురువుగారూ! నాదొక ప్రార్థన"

"ఏమిటి చెప్పండి!"

"సంధ్యావందనం, దేవుడి పూజ ఇవి వీలున్నంత వరకు చేస్తున్నా"

"చాలా సంతోషం"

"ఏదైనా మంత్రోపదేశం పొందాలన్న ఆశ అధికంగా ఉంది".

ఈ మాటను విన్న గురువుగారి ముఖం గంభీరంగా వున్నట్టుండి మారిపోయింది. తమ దర్శనానికి వచ్చే భక్తులెలాంటి వారో గురువుగారికి తెలిసిపోయేది. ఈ న్యాయవాది విషయమూ అలాగే గురువుగారికి గోచరమైంది. ఆ 'వకీలు' వాళ్ళ తల్లిదండ్రులకు ఒకడే కొడుకు. ధనవంతుల ఇంటి అమ్మాయిని పెళ్ళి చేసుకొన్నాడు. తర్వాత తల్లిదండ్రుల్ని దూరం చేసుకొన్నాడు. ఆ ముసలి వాళ్ళు పాపం దూరంగా ఏదో పల్లెలో మగ్గుతూ వుండేవాళ్ళు.

ఈ విషయమంతా గురువుగారికి మనస్సులో స్ఫురించింది. అప్పుడు ఆయన ఏమీ మాట్లాడకుండా ఉన్నారు. న్యాయవాదే ఇలా మళ్ళీ అన్నాడు.



'గురువుగారు నా విన్నపాన్ని మన్నించాలని ప్రార్థన'

"మీకు ఉపదేశం ఎందుకండి? మీరు గురువును ఆశ్రయించాల్సింది ఎప్పుడో చెప్పండి? – మొదట తల్లిదండ్రుల్ని ప్రేమతో సేవించి తర్వాత గురువు గారి దగ్గరికి రావాలి. మరి మీరు – తల్లిదండ్రుల్ని నిర్లక్ష్యంగా వదిలేశారు". అన్నారు గురువుగారు. వకీలు గారికి అప్పుడు జ్ఞానోదయమయింది. పశ్చాత్తాపంతో తలవంచాడు.

"పోయి మీ ముసలి తల్లిదండ్రుల్ని పిలుచుకు వెళ్ళి మీ దగ్గర ఉంచుకోండి. వాళ్ళను బాగా సేవించండి. వాళ్ళను సంతోషపెట్టండి. తర్వాత నా దగ్గరికి రండి" అన్నారు గురుపాదులు. ఆయనతో పాటు వచ్చిన ఆయన భార్యకు కూడా పత్నీ ధర్మాన్ని స్వామి బోధించారు.

## రోగుల సేవే నిజమైన పూజ :

శ్రీ గురుపాదులు చాలాకాలం 'కాలడి'లో వున్నారు. అక్కడ వారిని దర్శించడానికి 'ముస్లిం' మతానుయాయుడైన ఒక



అధికారి ఒకాయన వచ్చాడు. మంచి సంస్కారవంతుడాయన. గురువుగారికి నమస్కరించి వారి అనుమతితో కూర్చున్నాడు. యోగక్షేమాలు కనుక్కొన్న తర్వాత స్వామివారన్నారు: "మీరు ఖురానును పూర్తిగా చదివారా!"

"పూర్తిగా చదివానని ధైర్యంగా చెప్పలేను కాని ఏదో సామాన్యంగా చదువుకున్నాను"

"సంతోషం! చదివిన దాన్ని బాగా అర్థం చేసుకొన్నారా!"

"బాగా అర్థం చేసుకొన్నానని చెప్పలేను కాని సుమారుగా అర్థం చేసుకొన్నాను"

"అర్థం చేసుకొన్న దాన్ని జీవితంలో అనుసరిస్తున్నారా!"

"అనుసరించడానికి ప్రయత్నిస్తున్నాను"

"వాటిలో ఏదో ఒక తత్త్వాన్ని (రహస్యాన్ని) బాగా అర్థం చేసుకొని కార్యరూపంలో పెడితే దానివల్ల దేవుడు సంతోషిస్తాడు"

"స్వామీ! మీ ప్రబోధం నాకు చాలా నచ్చింది. ఇక కొన్నిరోజులకు నాకీ ఉద్యోగ కాలం అయిపోతుంది. పదవీ విరమణ చేశాక సంఘసేవ చేయాలని ఆశపడుతున్నాను"



"సంఘ సేవ అంటే ఎలా?"

"రోగుల సేవ చెయ్యడం."

"అది నిజంగా మెచ్చుకోదగిన విషయం. నిస్సహాయులకు చేసే సేవ, దేవుడి సేవే అవుతుంది".

"కుష్ఠు రోగులకు ఒక ఆశ్రమం స్థాపించి వాళ్ళసేవ చేస్తూ అక్కడే వుండిపోవాలని నిశ్చయించాను. దానికి మీ ఆశీస్సులు కావాలి".

"రోగుల సేవ కంటే గొప్ప కార్యం మరేదీ లేదు. అదే నిజమైన దేవుడి పూజ. తప్పక చెయ్యండి"

ఆ అధికారి అలాగే తన విశ్రాంతి జీవితమంతా కుష్ఠురోగుల సేవ చేస్తూ జీవితాన్ని సార్థకం చేసుకొన్నాడు.

## వ్యాపారం కూడా దేవుడి సేవే :

ఒక రోజున శ్రీ గురుపాదులు భక్తులకు తీర్థం ఇస్తున్నారు. భక్తుల సందడి ఎక్కువగా వుంది. ఆ సందడి తగ్గాక ఒక వైశ్య యువకుడు ముందుకు వచ్చి వినయంతో స్వామికి నమస్కరించాడు.

వంగి తీర్థానికి చేయి చాచాడు. గురువుగారు చూశారు. ఆ యువకుడు ఏదో బాధతో, కష్టనష్టాలకు గురైన వాడిలాగా కనిపించాడు. తీర్థమిస్తూ, ఆ యువకుడి తండ్రి పేరు చెప్పి

"నీవు ...... వాళ్ళ అబ్బాయివి కదూ!" అని గురువుగారు ప్రశ్నించారు. అంతటి గురువు తన తండ్రి పేరు చెప్పి తనను గుర్తించారని ఆ యువకుడెంతో సంబరపడిపోయాడు. తన తండ్రి వ్యాపారంలో నష్టానికి గురై, ఆ బాధతోనే చనిపోవడాన్ని, తమ సంసారం కష్టాల్లో వున్నదన్న విషయాన్ని ఆ యువకుడు గురువుగారికి విన్నవించుకొన్నాడు.

'మా నాన్నగారు చనిపోతూ' మనకు దైవస్వరూపులు శృంగేరీ గురువులు శ్రీ చంద్రశేఖర భారతీ స్వాములు. నీకు తీరని కష్టం వచ్చినపుడు వెళ్ళి ఆయన దర్శనం చేసుకో. వారి దృష్టి నీపైన పడితేచాలు. కష్టాలన్నీ పరిహారమవుతాయి. వారే మనకు దిక్కు' అని చెప్పారు. నేను మా నాన్నగారిలాగే వ్యాపారం చేస్తున్నాను. కాని ఏదీ లాభసాటిగా వుండటం లేదు. ఏది మొదలుపెట్టినా నష్టంగానే వుంటోంది" అని బాధపడ్డాడా యువకుడు.



గురువుగారు "నాయనా! దేవుడి దయ నీకు తప్పక కలుగుతుంది. మధ్యాహ్నం రా. ప్రసాదమిస్తాను" అని ప్రశాంతంగా చెప్పారు.

ఆ యువకుడు గురువుగారి దర్శనంకోసం మళ్ళీ మధ్యాహ్నం నాలుగు గంటలకు వెళ్ళాడు. గురువుగారు ఆ యువకుడి తండ్రి మంచిగుణాల్ని, సాధు స్వభావాన్ని, ధర్మబుద్ధినీ ప్రశంసించి

"నీవు కూడా మీ నాన్నలాగే కావాలి. వ్యాపారమే కొనసాగించు. వ్యాపారం చేస్తూ కూడా ధార్మికుడుగా వుండటానికి వీలుంది. అతి లాభాల కోసం ఆశపడవద్దు. తూకంలో, కొలతల్లో మోసం చెయ్యవద్దు. మంచి వస్తువుల్ని మాత్రమే అమ్ము. కల్తీ వస్తువుల్ని అమ్మవద్దు. వ్యాపారాన్నీ దేవుడి సేవగా భావించు, ధర్మబుద్ధితో ప్రవర్తించు. దేవుడి అనుగ్రహం నీకు లభిస్తుంది" అని ఆ యువకుణ్ణి ప్రబోధించారు.

ఆశీర్వాదంతో పాటు ఆ యువకుడికి స్వామివారు కొంత డబ్బు కూడా ఇచ్చారు. ఆ యువకుడూ గురువుగారి మాటల్ని



అనుసరిస్తూ ప్రవర్తించి నాన్నగారి కాలంలోలాగా ధనవంతుడు అయ్యాడు. మంచి పేరూ సంపాదించుకొన్నాడు.

## వైరాగ్యమూర్తి :

విజయనగర సామ్రాజ్యానికి ప్రేరకులు శ్రీ విద్యారణ్య స్వామి. వారి కాలం నుంచీ శృంగేరీ మఠానికి ప్రత్యేక స్థానమూ, గౌరవమూ ఉన్నాయి. సనాతన హిందూ ధర్మ సంరక్షణ కోసం వారూ, వారి గురువులైన విద్యాతీర్థులూ, భారతీ తీర్థులూ తపస్సులు చేశారు. క్షత్రియుల్ని సమకట్టి రాజ్యం స్థాపించారు. నూత్న రాజ్య నిర్మాణం కోసం తమ మఠానికున్న సంపదనంతా ధారపోశారు. శృంగేరీ గురుపీఠం చేసిన ఈ మహత్తర త్యాగమనే పునాదిపైనే క్షత్రియ వీరులైన హరిహరరాయలూ, బుక్కరాయలూ రాజ్య నిర్మాణం చేశారు. అప్పటినుంచీ శృంగేరీ గురువులు, కర్ణాటక సింహాసన స్థాపనాచార్యులన్న గౌరవాన్ని పొందారు. వారికి రాజయోగ్య చిహ్నాలైన గౌరవ బిరుదు లివ్వబడ్డాయి. రత్నకిరీటం, బంగారు పల్లకి, గుర్రాలు, భటసమూహం - మొదలైన రాజలాంఛనాలన్నీ ఇవ్వబడ్డాయి. మఠ దేవాలయాల పోషణ కోసం పెద్ద 'జహంగీరు' కూడా దత్తం చేయబడింది.



శృంగేరీ గురువులు మఠాధిపత్య విషయంలో రాజుల్లాగానే వ్యవహరించాల్సి వచ్చేది. నవరాత్రి, రథోత్సవం మొదలైన విశేష పర్వదినాల్లోనూ, దేశ సంచారం చేసే వేళల్లోనూ రాచమర్యాదల్ని ధరించాల్సి వచ్చేది. శ్రీ చంద్ర శేఖర స్వామి వారు పీఠానికి రాకమునుపే మౌన వైరాగ్యాలతో కాలం గడుపుతూ వుండేవారని చూశాంగా! సన్యాసం స్వీకరించడంతో ఈ వైరాగ్యదృష్టి మరింత ఎక్కువయింది. వారు రాజలాంఛనాల్ని ధరించడానికీ చాలా సంకోచపడేవారు.

గురువుగారి వైరాగ్యం రానురాను అధికమైపోయింది. వారి నిత్యావసరాలు చాలా స్వల్పమైనవి. ఆయన కట్టుకునే వస్త్రం అంచులేని సాదా ధోవతి. ఆహారం కూడా చాలా కొంచెంగా తీసుకొనేవారు. రుద్రాక్షమాల ఒక్కటి ధరించేవారు. ధ్యాన సమాధుల్లో లేనపుడు కూడా ఒంటరిగానే ఉండటాన్ని అభిలషించే వారు. అంతర్ముఖుడై ఉన్నపుడు ఆయన దర్శనం దుర్లభమై పోయేది. మఠానికి సంబంధించిన ముఖ్య విషయాల్లో కూడా ఆసక్తి కనబరిచేవారుకారు- సలహాలూ - అభిప్రాయలూ కూడా ఇచ్చేవారుకారు.

శిష్యులీ విషయాన్ని గురువుగారికి ఎలాగో విన్నవించారు. తమకు మార్గాన్ని చూపించడానికి, మఠ పరిపాలనలో సలహాలివ్వడానికి గురువుగారు 'మనసు చేయా'లని ఎన్నో మార్లు వేడుకొన్నారు. శిష్యుల కోరిక కాదనలేక గురువుగారు అంగీకరించారు.

కొన్ని రోజుల తర్వాత ఇప్పటి జగద్గురువులైన శ్రీ అభినవ విద్యాతీర్థుల్ని స్వామివారు శిష్యుడిగా పరిగ్రహించారు. ఆయనకు అన్ని మార్గాల్నీ బోధించారు.

"ఇకనుంచి వీరే మీ జగద్గురువులు. ఈ పీఠానికి చెందాల్సిన మర్యాదా గౌరవాలన్నీ వీరికే చెల్లాలి" అని తమ శిష్యులకు గురుపాదులు చెప్పారు. తమ ఉత్తరాధికారిని తామే స్వంతంగా గ్రహించి, ఆయనకు మార్గాల్ని చూపి, తాము సంపూర్ణ తపశ్చర్యలో మునిగిపోయారు.

**మహాసమాధి :**

శ్రీ చంద్రశేఖర భారతీస్వామి 1954 సెప్టెంబరు 24న మహాలయ అమావాస్యనాడు ఉదయం తుంగానదిలో మహాసమాధి



పొందారు. వారి పవిత్ర దేహం తుంగానదిలో తేలుతూ పోతుండగా శిష్యులు దూకి తీరానికి తెచ్చారు. శరీరం పద్మాసన స్థితిలో వుంది. కుడి చేయి మాత్రం 'చిన్ముద్ర'ను ప్రదర్శిస్తూంది. శరీరంలోకి ఒక బొట్టు నీళ్ళు కూడా పోలేదు. వారి పవిత్ర శరీరమూ గురు సమాధుల పక్కనే సమాధిని పొందింది.

**ఆచరించాల్సింది ఈ ధర్మాన్ని :**

శ్రీ గురుపాదులు ఏ మతాన్నీ దూషించే వారు కారు. ఏ మత బోధకుల్నీ నిందించేవారుకారు. 'అన్ని మతాల ధ్యేయాలూ ఒక్కటే; కాకపోతే మార్గాల్లో మాత్రమే భేదం' అని అనేవారు. 'దేవుడు ప్రతి ఒక్కడికీ తన యోగ్యతార్హతల్ని బట్టి తగిన మార్గాన్ని చూపించే వున్నాడు. ప్రతీ మతీయుడూ తమ తమ మతాల్లోని మార్గంలో నడుచుకొంటే 'తగాదా'కు అవకాశం వుండదు అని చెప్పేవారు. 'తన శిశువుల్లో ఏ బిడ్డకు ఎంత ఆహారమివ్వాలి, ఎలాంటి ఆహారమివ్వాలి – అన్న విషయం తల్లికి బాగా తెలుసు. ఒక శిశువుకి పాలిచ్చేతల్లి మరో శిశువుకి అన్నం తినిపిస్తే దాన్ని



పక్షపాతమని అనగలమా! ఎండలో అలిసిన వాడికి పానకమో చన్నీళ్ళో ఇవ్వవచ్చు. జ్వరతాపంతో అలసిపోయిన వాడికి పానకమో, చన్నీళ్ళో ఇవ్వవచ్చా!

'ధర్మమూ ప్రతి ఒక్కడూ సులభంగా అనుసరించదగిన మార్గాన్నే చూపిస్తుంది. ఏ మతం గొప్పది – ఏది శ్రేష్ఠం అనే చర్చ ఇప్పుడు ముఖ్యం కాదు. ఇప్పుడు కావాల్సింది ధర్మ మార్గంలో నడవడం – అంటే సత్యం చెప్పడం, ధర్మబుద్ధి, పరిశుద్ధమైన ప్రవర్తన, తల్లిదండ్రులపైన భక్తి, పెద్దల్ని గురువుల్ని గౌరవించడం, మోసం చెయ్యకుండా ఉండడం, అబద్ధం చెప్పకుండా ఉండడం, ఇతురుల్ని ద్వేషించకుండా ఉండడం, ఇతరుల వస్తువులపై ఆశపడకుండా ఉండడం– ఇలాంటి సులభ నియమాల్ని అనుసరించడమే ధర్మపాలనమంటే. మనం నేర్చుకోవాల్సింది ఈ ధర్మాన్నే. ఆచరించాల్సిందీ ఈ ధర్మాన్నే' అని శ్రీ గురుపాదుల దివ్యోపదేశం.

మన పూర్వ మహర్షులు బోధించిన విషయం ఇదేగా! మన ధర్మశాస్త్రాల రహస్యం కూడా ఇదే కదూ! అవును ఇదే ధర్మం.